క్లుప్తంగా

బంగారు ఆభరణం బహూకరణ



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో పంట కాలువ ఒడ్డున ఉన్న అభయ ఆంజనేయస్వామికి ఉండవల్లికి చెందిన భార్యాభర్తలు ఆంజనేయులు దంపతులు శనివారం బంగారు ఆభరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మున్నంగి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఉండవల్లికి చెందిన ఆంజనేయులు దంపతులు రూ.30 వేల విలువైన బంగారు ఆభరణాన్ని అభయ ఆంజనేయస్వామి వారికి అందజేశారని తెలిపారు. అనంతరం ఆంజనేయులు దంపతులను ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్నంగి నాగిరెడ్డి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఒకరు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గాలిబాలి శాఖా గ్రంథాలయ వద్ద గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు తన కారును నిలిపిన కొద్ది సేపటి తరువాత అతని స్నేహితుడు కారు నడుపుతానని చెప్పి తీసుకుని డ్రైవింగ్ చేస్తుండగా వేగం అదుపు చేయలేక పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారుముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఉపాధ్యాయుడికి గాయాలు కావడంతో ప్రథమ చికిత్స కోసం వైద్యశాలకు తీసుకెళ్లారు.

జల్‌జీవన్ మిషన్ పనులు పరిశీలన



బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురంలో జల్‌జీవన్ మిషన్ పనులను శనివారం నేషనల్ జల్‌జీవన్ మిషన్ బృందం సభ్యులు అబ్బార్ ఖాన్, ప్రత్యూష్ చౌదరి పరిశీలించారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించి గ్రామస్తులతో స్వయంగా మాట్లాడి నీటి సమస్య తొలగిన వైనంపై తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో క్షేత్రస్థాయి పనుల నిర్వహణపై చర్చించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వారి వెంట సర్పంచి తోకల సరోజినీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ నాయకులు తోకల నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఆర్ సురేష్, డీఈఏ రామకృష్ణ, ఏఈఈ సీహెచ్ నాగ శ్రీనివాస్ గుత్తేదారు తన్నీరు ఆంజనేయులు పాల్గొన్నారు.

దిగువ కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్: కనకదుర్గ వారధి కింద దిగువ కృష్ణానది నీటిలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు శనివారం బయటకు తీసి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. కృష్ణానదిపై ఉన్న వారధి కింద 36వ ఖానా వద్ద మృతదేహం ఉందని పశువుల కాపరులు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు వెళ్లి నీటిలో తేలియాడుతున్న పురుషుని మృతదేహాన్ని బయటకు తీయించినట్లు చెప్పారు. మృతుడి ఒంటిపై ఆఫ్ హ్యాండ్స్ తెల్ల బనీన్, కాఫీ కలర్ డ్రాయిర్ ధరించి ఉన్నాడని, బహుశా స్నానానికి దిగి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలకు 'ఈమని'



తాడేపల్లి రూరల్: నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల మండలం ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు శనివారం తెలిపారు. ఉన్నత పాఠశాలకు చెందిన మద్దిరాల రోహిత, కాటూరి లిఖిత, కాబోతు రోజా, గరిక ధనలక్ష్మి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ ఫైనల్ ప్రొవిజనల్ జాబితాలో నలుగురు విద్యార్థులు చోటుదక్కించుకున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లకు రూ.48వేల స్కాలర్ షిప్ మంజూరు అవుతుందని వివరించారు. గత ఆరేళ్ల నుంచి తమ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం చెప్పారు. జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.కోటయ్య, వైస్ చైర్మన్ ఎం.శిరీషలతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఇప్పటంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఇప్పటంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శారదాదేవి



పెనుమాకలో బీటీ రోడ్డును పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

కమిషనర్ శారదాదేవి

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ యు.శారదాదేవి సూచించారు. దాదాపుగా రూ.3 కోట్లతో చేపట్టిన పనులను శనివారం పరిశీలించారు. ఇప్పటం ప్రధాన రహదారితో పాటు పలు డొంకరోడ్లు బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే డొంకరోడ్లలో బీటీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, నిరంతరం సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో పాటు కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. బీటీ రోడ్ల మార్జిన్ల వెంబడి వెంటనే సైడు బరమ్స్ తోలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు ప్రవీణ్, కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పలు డొంకరోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే ఆర్కే సహాయంతో గతంలో నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే తాడేపల్లి రూరల్‌లోని ఇప్పటం, మంగళగిరి రూరల్‌లోని పెదవడ్లపూడి కలుపుతూ బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాజాగా ఉండవల్లి, తుళ్లూరు మండలంలోని వెంకటపాలెం, మంగళగిరి రూరల్‌లోని యర్రబాలెం- అమరావతి రోడ్డును కలుపుతూ మరో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు శనివారం కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు రోడ్లను పరిశీలించారు. డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పెనుమాక, యర్రబాలెం రోడ్డులోని మామిడితోట నుంచి కృష్ణాయపాలెం-యర్రబాలెం, అమరావతి రోడ్డు వరకు 1.3 కిలో మీటర్ల మేర రూ.1.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అలాగే కొత్తగా పెనుమాకలోని వైఎస్సార్ సెంటర్ నుంచి తుళ్లూరు మండలం వెంకటపాలెం వెళ్లేందుకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉండగా మరో రూ.1.30 కోట్ల నిధులు కేటాయించి కొండవీటి వాగు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు కిశోర్, ప్రవీణ్, వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి, బొక్కా నాని, సుభానీ, బషీర్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీఐ వాసు

మేడికొండూరు: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మేడికొండూరు సీఐ కె.వాసు అన్నారు. చిరు ధాన్యాల ప్రదర్శన భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ, కాలేజ్ కమ్యూనిటీస్, సైన్స్ లాంఫేస్ సొసైటీ సంయుక్తంగా ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. సీఐ వాసు మాట్లాడుతూ విద్యార్థుల పర్యావరణ పరిరక్షణపై సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. చిరు ధాన్యాల ఆవశ్యకత గురించి వివరించారు. కాలేజ్ కమ్యూనిటీ సైన్స్ అధ్యాపకులు అనూరాధ మాట్లాడుతూ చిరు ధాన్యాలు ఎలా వినియోగించుకోవాలి, ఫైబర్, పీచు పదార్థం ఎక్కువగా ఉండటం రోగనిరోధక శక్తి పెరుగుతోందన్నారు. నెహ్రూ యువ కేంద్రం గుంటూరు జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ గత మిషన్ లైఫ్‌లో భాగంగా పర్యావరణ రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌కేబీఎన్ అనాసరి, సెక్రటరీ పాడుపల్లి రమేష్, కాలేజ్ ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లు కీలకం



వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్ కుమార్

వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ప్రభుత్వానికి ప్రజలకు సైనికుల్లా పని చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు అవార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి అవినీతి లేకుండా సంక్షేమం అందిస్తున్న జగనన్న పాలనకు వలంటీర్ల సేవలు కూడా కీలకం అన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అర్హులకు అందిస్తున్న వాలంటీర్ల సేవలను గుర్తించి వారిని అభినందించుకోవడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలను పెట్టి నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు నేడు ఏపీలో జగనన్న అందిస్తున్న ప్రజా రంజక పాలన దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలో సేవా మిత్ర, రత్న, వజ్ర అవార్డులు వరించిన వలంటీర్లను శాలువా, పురస్కార పత్రంతో ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మాదల మహేంద్ర, గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, ఎస్సీ విభాగం నాయకులు కొప్పుల శేషగిరిరావు, శృంగారపాటి సందీప్, రమణారెడ్డి, బెజ్జం రాంబాబు, అరేపల్లి జోజి, నేలపాటి నాగేంద్ర, కంతేటి ఫకీరయ్య, డీజే శ్రీను, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్టపై రైతులకు అవగాహన కల్పించాలి

తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): పచ్చిరొట్ట వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని దుగ్గిరాల వ్యవసాయాధికారిణి శిరీష అన్నారు. దుగ్గిరాల మండల పరిధి రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఓలతో ఆమె అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలు వేసే ముందు పచ్చిరొట్ట వేసి పండించి దానిని దమ్ము చేయడం, దున్నడం వల్ల పొలంలో నేల ఎంతో సారవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందించేందుకు సబ్సిడీ ప్రకటించినట్లు తెలిపారు. ఇప్పటికే మండల వ్యవసాయ కేంద్రంలో జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైతుకు జీలుగ 10 కేజీలు, బయట మార్కెట్‌లో కేజీ జీలుగ విత్తనాల ధర రూ.79 ఉండగా ప్రభుత్వం కేజీ జీలుగ విత్తనాలను రూ.39.50 అందజేయడం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా జనుము విత్తనాలు రైతుకు 10 కేజీల చొప్పున అందజేస్తామని, బయట కేజీ విత్తనాల ధర రూ.84 ఉండగా రూ.42 ఇస్తున్నామని తెలిపారు. పిల్లి పెసర రైతుకు ఎనిమిది కేజీల చొప్పున అందజేస్తామని, ఇవి బయట మార్కెట్‌లో కిలో రూ.97 ఉండగా సబ్సిడీపై రూ.48.50లకు అందజేస్తున్నట్లు చెప్పారు. సబ్సిడీపై విత్తనాలు పొంది పంట వేసే ముందే పచ్చిరొట్ట దమ్ము చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

డయేరియాపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: పిల్లల్లో వచ్చే డయేరియాపై ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం డయేరియా నియంత్రణ పక్షోత్సవ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫరీనాబేగం మాట్లాడుతూ నీళ్ల విరోచనాల వల్ల ఐదేళ్లలోపు పిల్లలు అనారోగ్యాల బారిన పడి మృతువాత పడుతున్నారని హెచ్చరించారు. దాని నివారణకు నీళ్ల విరోచనాలు రాకుండా ఉండేలా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం వంటివాటిపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో సబ్‌సెంటర్లు, అంగన్‌వాడీకేంద్రాలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని వాటిని తాగించాలని చెప్పారు. ఈ పక్షోత్సవాలు ఈనెల 5 నుంచి 17వరకు జరుగుతాయన్నారు.

ఆటో మోటివ్ రంగంలో ఉజ్వల భవిష్యత్

- బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్
- ఐనవోలు వీఐటీ- ఏపీలో ఘనంగా విశ్వ విద్యాలయ దినోత్సవం



వార్షిక ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న అతిథులు, యూనివర్సిటీ ప్రతినిధులు, సిబ్బంది

ఐనవోలు(తాడికొండ): ఆటోమోటివ్ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని బాష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయంలో శనివారం నిర్వహించిన విశ్వ విద్యాలయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత విశ్వ విద్యాలయ వార్షిక నివేదికను ఆవిష్కరించిన అనంతరం మహాత్మాగాంధీ అకడమిక్ బ్లాక్‌లోని మేకర్స్ స్పేస్ మరియు ఇంజినీరింగ్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని, విశ్వవిద్యాలయం ఏపీలో తన ప్రయాణాన్ని విజయవంతం చేస్తున్నందుకు ఆయన అభినందించారు. వీఐటీ- ఏపీ యూనివర్సిటీ విద్యకు సంబంధించిన విశిష్టమైన కాన్సెప్ట్ డిజైన్ యువర్ ఓన్ డిగ్రీని అభినందిస్తూ, విద్యార్థులు ఈ కాన్సెప్ట్ ద్వారా రెగ్యులర్ స్ట్రీమ్ కాకుండా ఏదైనా ఒక స్పెషలైజేషన్‌ను ఎంచుకోవడానికి వీలు కలుగుతుందని వివరించారు. పూర్తి ఫ్లెక్సిబుల్ క్రెడిట్ సిస్టమ్ ద్వారా విద్యార్థులు వారి సొంత సెమిస్టర్ ప్లాన్‌ను చేసుకోవడం వలన కోర్సులను ఎంపిక చేసుకోవడానికి దోహద పడుతుందన్నారు. విఐటి వ్యవస్థాపకుడు మరియు ఛాన్సెలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ వీఐటీ నాలుగు క్యాంపస్‌లలో దాదాపు 80 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, అత్యుత్తమ విద్యా విధానాలు, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామని వివరించారు. 171 అకాడమిక్ అవార్డులు, 12 ఎండోమెంట్ అవార్డులు, 142 అధ్యాపక అవార్డులు, 24 సిబ్బంది అవార్డులు, 110 రీసెర్చ్ స్కాలర్స్ అవార్డులు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులు, మరియు సిబ్బందిని ప్రశంసించారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 32 మంది అధ్యాపకులు, 17 మంది సిబ్బందిని సత్కరించారు. వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి విశ్వ విద్యాలయ వార్షిక నివేదికను చదివి విశ్వ విద్యాలయ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డెప్యూటీ డైరెక్టర్(స్టూడెంట్ వెల్ఫేర్) డాక్టర్ అనుపమ నంబూరు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి తాడేపల్లికి చెందిన ఓ బాధిత మహిళకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన రూ.25వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. తాడేపల్లికి చెందిన షేక్ ఖాసింబి నాయనమ్మ జైతున్‌బీ వద్ద ఉంటుంది. ఖాసింబి వివాహం కుదిరింది. వివాహ ఖర్చుల కోసం రూ.25 వేలను స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు అందించారు.

మద్యపాన నిషేధంపై అవగాహన



మంగళగిరి: మద్యపాన నిషేధంపై అవగాహన సైకిల్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఆంజనేయ ధ్యాన యోగ మండలి యోగాచార్యులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో నగరంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి మద్యం పానం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో అత్తలూరి శివ శోభనాద్రి, దామర్ల కృష్ణార్జునరావు, గాదంశెట్టి రామకృష్ణ, శాంతి, శివ పార్వతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా డాన్స్ పోటీలు



డాన్స్ చేస్తున్న జూనియర్స్

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు రెయిన్‌బో కల్యాణ్ ఆధ్వర్యంలో శనివారం సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వెస్ట్రన్ డాన్స్ సోలో పోటీలు ఉత్సాహంగా సాగాయి. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. నగరంలోని వివిధ డాన్స్ అకాడమీల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాన్ని సంస్థ ఉపాధ్యక్షులు కె.వి. రమేష్, సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉదయ కుమార్, సభ్యులు రాజా, వెంకట్, కరీమ్, రాజాసింగ్ పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణపై ఆకట్టుకున్న కళాజాతా

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గుంటూరు ప్రాంతీయ కార్యాలయం పర్యవేక్షణలో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని శనివారం పట్నంబజారులో కళాజాతా నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ ఎవేర్‌నెస్ ఆర్గనైజేషన్ కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులోని 225 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు నేపథ్యంలో ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7- 9 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. తాడికొండ మండలంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

'యూబీఐ ముస్కాన్'పై చిన్నారులకు అవగాహన



పిల్లలతో యూబీఐ రీజనల్ హెడ్ జయ జీవన్, అశ్వత్థ నాయక్, శ్రీనివాస కుమార్ హరి

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ప్రాంతీయ కార్యాలయంలో శనివారం ఎస్‌బీ ముస్కాన్ స్కీం వినియోగదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూబీఐ డెప్యూటీ రీజినల్ హెడ్ జి.జయజీవన్ మాట్లాడుతూ ఎస్‌బీ ముస్కాన్ అనేది మైనర్ పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకమని తెలిపారు. బ్యాంక్ అందించే వివిధ ఉత్పత్తులు, సేవల్ని వివరించారు. భవిష్యత్ తరాల వారికి బ్యాంకింగ్ విశిష్టతను తెలియజేశారు. పిల్లల పాటలు, రైమ్స్, కథలు చెప్పడం అలరించాయి. సమావేశంలో బ్యాంక్ డీజీఎం జె.అశ్వత్థనాయక్, చీఫ్ మేనేజర్ శ్రీనివాసకుమార్ హరి, శ్యామలానగర్, బృందావన్ గార్డెన్స్ శాఖల మార్కెటింగ్ టీం, బ్రాంచీల హెడ్స్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం సబబు కాదు



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోళ్లమూడి రాజసుందరబాబు

నెహ్రూనగర్: రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎస్సీ, ఎస్టీలను అవమానిస్తున్నారని ఇద్వా(ఐడియల్ దళిత్ ఉమెన్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం 'చలో కలెక్టరేట్' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పార్లమెంటుకు అధిపతి అయిన రాష్ట్రపతిని నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దేశంలో క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, మైనార్టీలపై దాడులు చేస్తుంటే వాటిని నిరోధించకుండా మోదీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పెదగొట్టిపాడు, పెదమక్కెన తదితర ప్రాంతాల్లో అణిచివేతకు గురైన దళితులకు భూముల్ని కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 9 'చలో కలెక్టరేట్' నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైలు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

గుంటూరు మెడికల్: ఒడిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాద దుర్ఘటన అత్యంత బాధాకరమని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. మూడు రైళ్లు ఢీకొన్న ఘటనలో 278 మంది ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన 1100 మందికి మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సహాయక చర్యల్ని ముమ్మరం చేసి ప్రాణ నష్టాన్ని నివారించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. దేశ చరిత్రలోనే ఒరిస్సా రైలు ప్రమాద ఘటన అతిపెద్ద దుర్ఘటనగా పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని రూ.25 లక్షలకు పెంచి, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించాలని తోట డిమాండ్ చేశారు. రైలు ప్రమాద ఘటనపై కేంద్రం సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులకు అండగా నిలచి సహాయక చర్యల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బాలాసోర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితలకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన యువత మానవత్వాన్ని చాటి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు.

ఉల్లాసంగా సాగుతున్న పోటీలు



ప్రత్తిపాడు: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు, వేసవి శిబిరంలో నేర్చుకున్న పలు అంశాలపై రోజుకోరకం పోటీల్ని నిర్వహిస్తున్నారు. 1న క్యారమ్స్, 2న జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో కుర్చీలాట, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతపై శనివారం వ్యాసరచనతో పాటు చిత్రలేఖన పోటీల్ని లైబ్రేరియన్ అరుణ నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి 11న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు ఆమె చెప్పారు.

ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఉదయం లక్ష తులసి దళార్చన నిర్వహించారు. రాత్రి ద్వాదశి ప్రదక్షిణలు, పవళింపుసేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ఆయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.